నేడు కొత్తగూడలో సీతక్క పర్యటన

కొత్తగూడ, నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఆదివారం పంచాయతీ రాజ్ శాఖమంత్రి సీతక్క పర్యటించనున్నట్టు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య శనివారం తెలిపారు. కొత్తగూడ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొంటారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, గ్రామపార్టీ అధ్యక్ష, కార్యదర్శులు, మాజీ ప్రజాప్రతినిదులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

పంచాయతీ రిజర్వేషన్లపై కసరత్తు

- నేడు అధికారింగా వెల్లడి కానున్న రిజర్వేషన్లు
- సర్పంచ్ స్థానాల రిజర్వేషన్లను ఖరారు చేయనున్న ఆర్డీవోలు...
- వార్డుల రిజర్వేషన్లను ఖరారు చేయనున్న ఎంపీడీవోలు
- మారనున్న గత బీసీ రిజర్వేషన్లు
- ముమ్మరంగా ఎన్నికల ఏర్పాట్లు



బిజీ బిజీగా అధికార యంత్రాంగాలు

హనుమకొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు కీలకమైన రిజర్వేషన్ల ప్రక్రియ ఉమ్మడి జిల్లాలో శరవేగంగా జరుగుతోంది. రిజర్వేషన్లను ఖరారు చేయడంలో అధికారులంతా బిజీబిజీగా ఉన్నారు. రిజర్వేషన్ల ఖరారుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. దీనితో అప్రమత్తమైన అధికారులు.. శుక్రవారం నుంచే తమ పని మొదలు పెట్టారు. రోజంతా ఆయా గ్రామ పంచాయతీల జనాభా, ఓటర్ల సంఖ్య తదితర సంబంధిత వివరాలను సేకరించారు. శనివారం ఉదయం నుంచి రిజర్వేషన్ల ఖరారు పనిలో మునిగిపోయారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు దశల్లో నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించిన నేపథ్యంలో వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల అధికార యంత్రాంగతాలు ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయి. ఇందులో భాగంగా సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్ల ఖరారుకు శనివారం ఉదయం 9 గంటలనుంచి రాత్రి పొద్దుపోయే వరకు కుస్తీ పట్టారు. సర్పంచుల రిజర్వేషన్లను ఆర్డీవో, వార్డుల రిజర్వేషన్లను ఎంపీడీవోలు ఖరారు చేస్తున్నారు.

50 శాతం మించకుండా..

ప్రస్తుత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గతంలో మాదిరిగా 50 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలు జరిగే అవకాశం ఉండడంతో ఆ దిశగా అధికారులు రిజర్వేషన్లను ఖరారు చేస్తున్నారు. ఈ లెక్కన 50 శాతం స్థానాలు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పోను మిగిలిన 50 శాతం జనరల్ కేటగిరి స్థానాలుంటాయి. అన్నిట్లో సగం స్థానాలను మహిళలకు రిజర్వ్ చేయాల్సి ఉంది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను 2011 జనాభా ప్రాతిపదికన ఖరారు చేయాల్సి ఉంటుంది. గత నెల అక్టోబరులో నోటిఫికేషన్ ఇవ్వడానికి సన్నద్ధమైన తరుణంలోనే అంతకన్నా ముందు సెప్టెంబరు నెలాఖరులో ఈ రిజర్వేషన్లను ఖరారు చేశారు. గిరిజన గ్రామాలను ఎస్టీలకు రిజర్వ్ చేశారు. వాటిలో ఇప్పుడు కూడా ఎలాంటి మార్పులు లేనట్లు తెలుస్తోంది. ఎన్నికల సంఘం ఆదేశాలు, సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల గణన సర్వే (ఎస్ఈఈఈపీసీ)-2024 ప్రకారం డెడికేటెడ్ కమిషన్ ఇచ్చే నివేదిక ఆధారంగా బీసీ, జనరల్ రిజర్వేషన్లపై శనివారం కసరత్తు జరిగింది.

సర్పంచ్, వార్డు స్థానాలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 75 మండలాలు, 1708 గ్రామ పంచాయతీలు, 15006 వార్డులకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నది. వీటిలో వరంగల్ జిల్లాలో 11 మండలాలు, 317 గ్రామ పంచాయతీలు, 2754 వార్డులు, హనుమకొండ జిల్లాలో 12 మండలాలు, 210 గ్రామ పంచాయతీలు, 1986 వార్డులు, జనగామ జిల్లాలో 12 మండలాలు, 210 గ్రామ పంచాయతీలు, 1986 వార్డులు8, మహబూబాబాద్ జిల్లాలో 18 మండలాలు, 482 గ్రామ పంచాయతీలు, 4110 వార్డులు, ములుగు జిల్లాలో 10 మండలాలు, 171 గ్రామ పంచాయతీలు, 1520 వార్డులు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 12 మండలాలు, 248 గ్రామ పంచాయతీలు, 2101 వార్డులకు ఎన్నికలు జరపాల్సి ఉంది. ఉన్నాయి. పోలింగ్ నిర్వహణకు 15006 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

పర్యవేక్షణ

రెవెన్యూ డివిజన్ కార్యాలయం పరిధిలోని సర్పంచ్ స్థానాలకు ఆయా ఆర్డీవోలు రిజర్వేషన్లను కేటాయిస్తుండగా, వీటిని డీఆర్డీవో, అదనపు ఆర్డీవోలు, డీఎల్పీవోలు, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు పర్యవేక్షిస్తున్నారు. వార్డు స్థానాలకు ఎంపీడీవోలు రిజర్వేషన్లను నిర్ణయిస్తున్నారు. జడ్పీ సీఈవోలు, డిప్యూటీ సీఈవోలు, డీపీవోలు, డీఎల్పీవోలు పర్యవేక్షిస్తున్నారు. కాగా, మహిళలకు ఆయా స్థానాల్లో రిజర్వేషన్లను ఆదివారం కలెక్టర్ కార్యాలయాల్లో రాజకీయ నాయకుల సమక్షంలో డ్రా పద్ధతిలో ఖరారు చేస్తారు. ఆదే రోజు (మిగతా 7వ పేజీలో)



ప్రతిజ్ఞ చేస్తున్న మహారాష్ట్ర ఎంపీ అనిల్‌సుక్దేవ్‌రావు బోండే, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్

సర్దార్ వల్లభాయ్‌పటేల్ కృషితోనే దేశం ఐక్యత

మహారాష్ట్ర ఎంపీ డాక్టర్ అనిల్‌సుక్దేవ్‌రావు బోండే

మహబూబాబాద్, నవంబరు22 (ఆంధ్రజ్యోతి) : ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషితోనే దేశం నేటికి ఐక్యతతో ఉందని మహారాష్ట్ర రాజ్యసభ సభ్యుడు అనిల్ సుక్దేవ్‌రావు బోండే అన్నారు. మహబూబాబాద్‌లో కేంద్రయువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ ఆదేశాలతో మైభారత్, ఎన్ఎస్ఎస్, ఎన్సీసీ సంస్థల ఆధ్వర్యంలో శనివారం పటేల్ యూనిట్ మార్చ్ నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియం నుంచి అంబేద్కర్ సెంటర్‌వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ భారతీయులంతా స్వదేశీ వస్తువులనే వాడాలని, పటేల్ అనుసరించిన దృఢ సంకల్పాన్ని నేటి యువతరం ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

మనమంతా ఒక్కటే అని చాటిచెప్పిన పటేల్..

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

భారత దేశంలో స్వేచ్ఛకోసం పరితపించే వారని, ఎన్ని భాషలు మాట్లాడినా ఎన్ని ప్రాంతాలున్నా మనమంతా ఒక్కటేనని చాటి చెప్పిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్‌పటేల్ అని కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ కొనియాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక సంస్థానాలుగా విడివిడిగా ఉన్న దేశాన్ని ఒక్కటి చేయడంలో పటేల్ ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధన కోసం పాటు పడాలన్నారు. తొలుత ఎన్టీఆర్ స్టేడియంలో మొక్కను నాటారు. ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్, అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, కె.అనిల్‌కుమార్, మేరా యువభారత్ ఉమ్మడి వరంగల్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్, జిల్లా అధికారులు దేవిలాల్, జ్యోతి, మదార్, రాజేశ్వర్, రాజేంద్రప్రసాద్, విజయ, సింగారపు సతీష్, చందర్, ప్రేమ్‌రాయుడు, బానోత్ వీరన్న, సురేష్‌నాయక్, సురేష్ పాల్గొన్నారు.

సభను జయప్రదం చేయండి

టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

మహబూబాబాద్ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : హన్మకొండ అంబేద్కర్ భవన్‌లో ఈనెల 28న జరుపతలపెట్టిన ఉద్యోగుల సమస్యల సాధన సభను జయప్రదం తెలంగాణ నాన్ గెజిటెట్ ఆఫీసర్స్ (టీఎన్జీవోస్) యూనియన్ జిల్లా అధ్యక్షుడు వడ్డెబోయిన శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో శనివారం ఉద్యోగుల సమస్యల సాధన సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోయి అర్హులకు అందేలా చూస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో అగ్రభాగాన నిలుపుతున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ఉద్యోగుల, పెన్షనర్ల పెండింగ్‌లో బిల్లులను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. టీఎన్జీవోస్, టీజీవో నేతలు మైస రోహిత్‌కుమార్, కొప్పు ప్రసాద్, సునిల్, రాజేంద్రప్రసాద్, జ్యోతి, దక్షిణామూర్తి, పవన్‌శర్మ, గణేష్, సురేష్, వెంకటేశ్వర్లు, ముజాహిద్, అజయ్, గోపి, పురుషోత్తం, రాజు పాల్గొన్నారు.



ఉద్యోగుల సమస్యల సాధన సభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీఎన్జీవోస్, టీజీవో నేతలు

సాగుకు నిరంతర విద్యుత్

ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రైతులకు నిరంతరాయంగా విద్యుత్‌ను అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే భూక్య మురళీ నాయక్ అన్నారు. మహబూబాబాద్ మండలం వేమునూరు గ్రామంలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోమ్లాతండా, వేమునూరు, గూడూరు మండలం మట్టెవాడ సబ్ స్టేషన్‌లకు శంకుస్థాపన ఇప్పటికే చేశామన్నారు. వేమునూరు సబ్ స్టేషన్ నిర్మించేందుకు స్థలాన్ని ఉచితంగా ఇచ్చిన బ్రిడ్జి మోహన్‌రెడ్డిని అభినందించారు. జిల్లా విద్యుత్‌శాఖ అధికారి విజేందర్‌రెడ్డి, డీఈ సునిత, ఏడీఈ ప్రశాంత్, ఏఈ సంగీత, మాజీ ఎంపీటీసీ మంగీలాల్, మండల పార్టీ అధ్యక్షుడు మిట్టకంటి రాంరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు తంగెళ్లపల్లి ఉపేంద్రాచారి, రవినాయక్, రామరాజు బిక్షపతి, రూప్‌లాల్, సూర్య, సమ్మయ్య, నర్సయ్య, సందీప్ పాల్గొన్నారు.



వేమునూర్‌లో సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేస్తున్న మురళీనాయక్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మహబూబాబాద్ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మానుకోట పట్టణం కొత్త బజారులోని పలు కాలనీల్లో ఆదివారం ఉదయం 9.15 గంటల నుంచి 11.30 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు టౌన్-2 ఇన్‌చార్జి ఏఈ హరీష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాబునాయక్ తండా, సాంక్రియాతండా, మంగలికాలనీ, వినాయకతండా, కవితకాలనీ, అయ్యప్పనగర్, కురవిరోడ్ ఏరియా, సాలార్‌తండా, రెడ్డి బజారు. మార్వాడి సత్రం, పులిగోపాల్‌రావునగర్, పత్తి పాక ఏరియా, నెహ్రూసెంటర్‌లో చెట్ల కొమ్మల తొలగింపు, సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తుల దృష్ట్యా కరెంట్ సరఫరాను నిలిపివేస్తున్నామని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని హరీష్ కోరారు.

మహిళల దీవెనలతోనే ఇందిరమ్మ ప్రభుత్వం

ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

బయ్యారం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మహిళల దీవెనలతోనే తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం కొలువు తీరిందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పేర్కొన్నారు. బయ్యారంలో శనివారం స్వయం సహాయక సభ్యులకు ఇందిరమ్మ మహిళా శక్తి చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని మహిళా సోదరిమణులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సీఎం రేవంత్‌రెడ్డి వడ్డీలేని రుణాలు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. బయ్యారం మండలంలో ఇటీవల మూడు నూతన సబ్‌స్టేషన్లు మంజూరైనట్లు వెల్లడించారు. అంతకుముందు పలుచోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. 29 మంది కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. తహసీల్దార్ నాగరాజు, ఐకేపీ డీపీఎం శ్రీకాంత్, ఎస్సై మొహబూబీ, ఇల్లెందు మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు, బయ్యారం పీఏసీఎస్ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి, నాయకులు ప్రవీణ్‌నాయక్, నిర్మల, లక్ష్మీ, అన్నపూర్ణ, బాబా, నాగేశ్వరావు, ఉపేందర్, నర్సయ్య, శ్రీను, మంగిలాల్, రవినాయక్ పాల్గొన్నారు.



బయ్యారంలో మహిళకు చీర పంపిణీ చేస్తున్న కోరం కనకయ్య

సేవాలాల్ మహారాజ్ గుట్టపై భోగ్ బండార్ 8



కేసముద్రం మండలం అర్పనపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం

ఉత్కంఠ..!

- గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం
- అధికారుల కసరత్తు.. ఆశావహుల్లో ఆందోళన
- జిల్లాలో 482 సర్పంచ్‌లు, 4,110 వార్డులు
- వందకు వందశాతం ఎస్టీ గ్రామాల్లో వారికే..

మహబూబాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ఆరంభమైంది. డెడికేటెడ్ కమిషన్ ఇచ్చిన నివేదికకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం లభించడంతో.. సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్‌ల విధివిధానాలు ఖరారు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శనివారం జీవో విడుదల చేశారు. దీని ప్రకారం.. నేడు, రేపు (ఆది, సోమవారాలు) సర్పంచ్‌ల రిజర్వేషన్లను ఆర్డీవో, వార్డు సభ్యుల రిజర్వేషన్లను ఎంపీడీవోలు ఖరారు చేయడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు 50 శాతం మించకుండా రిజర్వేషన్లు తీయనున్నారు.

టెన్షన్.. టెన్షన్..

ఎస్టీలు వందకు వందశాతం ఉన్న గ్రామాల్లో పూర్తిగా సర్పంచ్‌లతో పాటు అన్ని వార్డు సభ్యులను ఎస్టీలకే రిజర్వు చేయనున్నారు. అయితే ఇతర గ్రామాలకు సంబంధించి ఎస్టీ రిజర్వేషన్లను తొలుత ఖరారు చేసి, ఆపై ఎస్సీ బీసీలకు కేటాయించడానికి విధివిధానాలు రావడంతో పాటు గతంలో జరిగిన ఎన్నికల్లో రిజర్వు చేసిన సర్పంచులు, వార్డులు తిరిగి అదే కేటగిరికి మళ్లీ చేయకూడదన్న నిబంధన కూడా ఉంది. దీంతో ఆయా గ్రామాల్లో రిజర్వేషన్లపై ఉత్కంఠత కొనసాగుతోంది.

రోటేషన్ పద్దతిలో..

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళ రిజర్వేషన్లను రోటేషన్ పద్ధతిలో అమలు చేస్తూ.. సర్పంచ్ రిజర్వేషన్ కోసం 2011 జనగణన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉద్యోగ, రాజకీయ, కుల (ఎస్ఈఈపీసీ) ప్రాతిపదికగా తీసుకోనున్నారు. దీంతో గ్రామాల్లో రిజర్వేషన్ల తారుమారు తథ్యమన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఈ పరిస్థితుల్లో తమకు రిజర్వేషన్‌లు కలిసి వస్తాయో లేదోననే ఆయా స్థానాల్లో పోటీచేయాలనే ఉవ్విలూరుతున్న ఆశావహుల్లో ఉత్కంఠత నెలకొంటోంది.

నాటికి, నేటికి.. జిల్లాలో మార్పులిలా..

మహబూబాబాద్ జిల్లాలో2019 ఎన్నికల్లో 16 మండలాలకు గాను 461 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2025 పంచాయతీ ఎన్నికల్లో పరిపాలన సౌలభ్యం కోసం జరిగిన మార్పుల్లో 18 మండలాలుగా విస్తరించి, గ్రామపంచాయతీల సంఖ్య 482కు చేరుకుంది. అప్పటి ఎన్నికల్లో (మిగతా 6వ పేజీలో)

డీసీసీ అధ్యక్షురాలిగా భూక్య ఉమ



మహబూబాబాద్ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షురాలిగా స్థానిక ఎమ్మెల్యే మురళీనాయక్ సతీమణి, మాజీ మునిసిపల్ చైర్‌పర్సన్ భూక్య ఉమ నియామకమయ్యారు. ఇటీవల రాష్ట్రంలోని అన్ని డీసీసీల అధ్యక్ష పదవులకు ఎన్నికల ప్రక్రియ చేపట్టారు. జిల్లాకు ఒక్కరు చొప్పున ఏఐసీసీ అబ్జర్వర్‌లను పంపించి దరఖాస్తులను స్వీకరించారు. అందులో దరఖాస్తులు చేసుకున్న వారినుంచి జిల్లాకు ముగ్గురు చొప్పున పేర్లను ఏఐసీసీకి పంపించారు. శనివారం రాత్రి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ జిల్లా అధ్యక్షుల జాబితాను ప్రకటించారు.

అందులో మహబూబాబాద్ జిల్లా అధ్యక్షురాలిగా ఉమకు అవకాశం దక్కింది. కాగా, ఉమ మహబూబాబాద్ మునిసిపాలిటీ తొలి చైర్‌పర్సన్‌గా ఎన్నికై 2014 నుంచి 2019 వరకు కొనసాగారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

మరిపెడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతతోనే ప్రతీ ఒక్కరికి మానసిక ప్రశాంతత లభిస్తుందని మరిపెడ సీఐ ఎస్.రాజ్‌కుమార్‌గౌడ్ అన్నారు. శనివారం మరిపెడ శివాలయంలో భూక్యా వెంకట్-మంగమ్మ దంపతులు అయ్యప్ప స్వాములకు అన్నదానం ఏర్పాటు చేయగా ఆ కార్యక్రమాన్ని సీఐ ప్రారంభించారు. కార్యక్రమంలో మరిపెడ మాజీ సర్పంచ్ పానుగోత్ రాంలాల్, కాంగ్రెస్ నేత చాపల శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ అర్చకుడు, గురుస్వాములు పాల్గొన్నారు.

ఎస్సై వీరభద్రరావుకు సన్మానం

మరిపెడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మరిపెడ ఎస్సై వీరభద్రరావును శనివారం మరిపెడ మండల యాదవ కుల సంఘ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. శాంతిభద్రతల విష యంలో ప్రతీ ఒక్కరు సహకరించాలని ఎస్సై యాదవ కుల సంఘ నాయకులను కోరారు. ఎస్సైని కలిసిన వారిలో కేసముద్రం వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఐలిమల్లు, డాక్టర్ నాగయ్య, కొమ్ము చంద్రశేఖర్, రేఖ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు. అనంతరం మరిపెడ గెస్ట్ హౌస్‌లో యాదవ కుల సంఘం బాధ్యులు సమావేశమై సంఘ బలోపేతానికి ఐక్యతతో పని చేయాలని, ఈ నెల 30న మళ్లీ అన్ని గ్రామాల కుల సంఘ నాయకులతో సమావేశం నిర్వహిస్తామన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేద ప్రజలకు వరం

మరిపెడ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పేద ప్రజలకు వరంలాంటిందని కాంగ్రెస్ పార్టీ ఎల్లంపేట గ్రామ అధ్యక్షుడు గండి వీరభద్రం అన్నారు. శనివారం మండలంలోని ఎల్లంపేటలో సుమారు రూ.2లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బాధితులు బండారు ఐలమ్మ, బత్తెం సాగర్, షేక్ సాహెబ్‌లకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేద ప్రజలకు సీఎంఆర్‌ఎఫ్ కొండంత అండన్నారు. ఈ కార్యక్రమంలో గండి బుచ్చిబాబు, వురుకొండ మనోజ్, దండే నరేశ్, గండి మహేశ్, గండి శ్యాం, అనిల్, నవీన్, పునేశ్, బత్తెం అశోక్, దొంతు లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు ఇందిరమ్మ చీరలు

- పంపిణీకి సిద్ధం చేసిన అధికారులు



పంపిణీ చేయనున్న చీర

తొర్రూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికి ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అర్హులైన మహిళలకు చీరలు పంపిణీ చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 20వ తేదీ తెలంగాణ సారె పేరుతో సీఎం రేవంత్ రెడ్డి ఇందిరమ్మ చీరల పంపిణీని ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని గ్రామాల్లో చీరల పంపిణీకి అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

మొదట గ్రామాల్లో...

జిల్లాలోని 18 మండలాల్లో 15,548 స్వయం సహాయక సంఘాలు ఉండగా వాటిల్లో 1,63,302 మంది మహిళలు ఉన్నారు. ముందుగా సద్దుల బతుకమ్మకు చీరల పంపిణీ చేయాలనుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 1,95,440 మందిని గుర్తించి ప్రతిపాదనలు పంపగా జిల్లాకు 1,50,000 చీరలు మాత్రమే రావడంతో వాటిని తొర్రూరులోని ఓ గోదాములో భద్రపరిచారు. ప్రభుత్వం ఇందిరమ్మ పేరిట చీరలు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టడంతో 18ఏళ్లు నిండిన ప్రతి మహిళకు చీర ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఐకేపీ, సివిల్ సప్లై అధికారులు ఆధార్ కార్డులను పరిగణలోకి తీసుకుని 18ఏళ్లు నిండిన మహిళలను గుర్తించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. మొదట డిసెంబర్ 9 నుంచి గ్రామాల్లో, 2వ విడతో జిల్లాలోని 5 మునిసిపాలిటీల్లో మార్చి 1 నుంచి 8 వరకు పంపిణీ చేపట్టనున్నారు. గ్రామైఖ్య సంఘ ప్రతినిధులు ఇంటింటికి తిరిగి బొట్టుపెట్టి చీరలు ఇచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న చీరలు రెండు రంగుల్లో ఉంటాయని అధికారులు తెలుపుతున్నారు. మొదటి విడతలో లబ్ధిదారులకు ఒక చీర పంపిణీ చేసి 6 నెలల తర్వాత మరో చీర అందించనున్నట్లు సమాచారం. జాబితాలోని లబ్ధిదారుల పేర్లు, ఆధార్ కార్డు, ఇతర వివరాలు గ్రామైఖ్య సంఘ ప్రతినిధులు ఫోన్‌లోని యాప్ ద్వారా ఫోటో తీసి అనంతరం చీరలు పంపిణీ చేయనున్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు

సీహెచ్.సంజీవ రావు, ఐకేపీ ఏపీఎం

ఇందిరమ్మ చీరల పంపిణీకి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని విధాలుగా ఏర్పాట్లు చేస్తున్నాం. స్వయం సహాయక సంఘాల అధ్యక్ష, కార్యదర్శుల ద్వారా మహిళల జాబితా తీసుకుని ప్రభుత్వ నిబంధనల మేరకు చీరల పంపిణీకి ఏర్పాట్లు పూర్తవుతున్నాయి.

రైతులు దళారులను నమ్మొద్దు


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న యుగంధర్‌రెడ్డి

మరిపెడ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని జిల్లా కాంగ్రెస్ నాయకుడు వంటికొమ్ము యుగంధర్ రెడ్డి అన్నారు. శనివారం వీరారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి, మాట్లాడారు. రైతును రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయమన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందన్నారు. సన్న వడ్లుకు క్వింటాకు రూ రూ.500 బోనస్ కూడా ఇస్తుందన్నారు. పంట అమ్మిన రెండు రోజుల్లోనే రైతుల ఖాతాలో డబ్బులు జమ అవుతాయన్నారు. గ్రామ పార్టీ నాయకులు బుర్ర యాదగిరి, గుగులోతు సోమనాయక్, జర్పుల విజయ్‌నాయక్, బుర్రా నవీన్‌యాదవ్, బానోతు రామచంద్రు, బుర్ర వెంకన్న, దాసరి మునేష్, బొర గంగయ్య, కొప్పుల గోపి, అజ్మీర సిరినాయక్, కేలోతు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

పెద్దవంగర, నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి): హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ తొర్రూరు డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలో ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని కోరుతూ ఈనెల 24న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని కర పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చేందుకు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అటకెక్కాయని, 420 హామీలు గాలిలో కలిశాయని, ఆపార్టీపై ప్రజలకు విశ్వాసం పోయిందని మండిపడ్డారు. పత్తి, మొక్కజొన్న, వరి పంటలను షరతులు లేకుండా కొనుగోలు చేయాలన్నారు. అర్హులైప పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు రూ.2500తో పాటు వృద్ధులకు పెన్షన్ రూ.4వేలను అందించాలన్నారు. సీసీఐ పత్తి కొనుగోలు కోసం ప్రవేశపెట్టిన కపాస్ కిసాన్ యాప్‌తో రద్దు చేసి రైతుల పత్తిని కొనుగోలు చేయాలన్నారు. ఈనెల 24న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈకార్యక్రమంలో ఆసంఘం నాయకులు చింత నవీన్, సంతోష్, మల్లయ్య, కుమారస్వామి, మల్లయ్య బిక్షం, లచ్చన్న, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ మృతి


సుధాకర్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మరిపెడ, నవంబరు 22 (ఆంధ్ర జ్యోతి) : పత్తి చేను దున్నుతుండగా ట్రాక్టర్ అదుపుతప్పి పాడుబడ్డ బావి బొందలోకి దూసుకెళ్లి పల్టీ కొట్టగా, దాని డ్రైవర్ మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి మండలంలోని ఎల్లంపేట రెవెన్యూ పరిధి భీమ్లా తండాలో చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. భూక్యా సుధాకర్ (27) తన పత్తి చేనులోని పత్తి కట్టెను తొలిగించేందుకు సాయంత్రం దున్నతుండగా ట్రాక్టర్ అదుపుతప్పి బావి బొందలో పడింది. దాని కిందనే పడిపోయిన సుధాకర్ అక్కడికి అక్కడే మృతి చెందారు. మృతుడికి తల్లితండ్రులు, భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గడ్డిమందు తాగి ఒకరి మృతి

మరిపెడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గడ్డి మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు గురైన సంఘటన శనివారం మరిపెడ మునిసిపల్ పరిధి దేశ్యాతండాలో చోటు చేసుకుంది. ఎస్సై వీరభద్రరావు తెలిపిన వివరాల ప్రకారం.. దేశ్యా తండాకు చెందిన బానోత్ బాలాజీ-బానోత్ చీనాల మధ్య గత కొద్ది రోజులుగా భూ తగదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో బాలాజీ చీనా (42)ను దూషిచడంతో మానసికక్షోభకు గురై చీనా శుక్రవారం పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి పోగా, గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందారు. ఈ ఘటనలో బాలాజీ, విజయలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

సొసైటీ అభివృద్ధికి నిరంతరం కృషి


బాధ్యతలు స్వీకరిస్తున్న చైర్మన్ హరిప్రసాద్

తొర్రూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక సహకార సంఘం సొసైటీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని చైర్మన్ కాకిరాల హరిప్రసాద్ అన్నారు. కోర్టు తీర్పు అనంతరం శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను బాధ్యతలు చేపట్టినపుడు సొసైటీలో కుర్చీలు తప్ప ఏమిలేవని, నేడు నూతన బిల్డింగ్, గోదాము, పెట్రోల్ బంక్, ఫర్టిలైజర్ షాపుల నిర్వహణ, 25 కొనుగోలు కేంద్రాలు, రైతుల వద్ద లాభం తీసుకోకుండా ఎమ్మార్పీకే యూరి యా అందించడం, వారి అభివృద్ధికి నిరంత రం కృషిచేస్తున్నానని తెలిపారు. సొసైటీలో ఎలాంటి అవినీతి జరగలేదని, నిరూపిస్తే దేనికైనా సిద్ధమేనని అన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చైర్మన్‌ను, డైరెక్టర్‌లను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సీఈవో మురళి, డైరెక్టర్‌లు జనార్దన్ రాజు, టీకూ నాయక్, ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

తొర్రూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ డాక్టర్ నాగవాణి అన్నారు. శనివారం బాల్య వివాహాల నిర్మూలన చట్టంలో భాగంగా అంగన్‌వాడీ, ఐకేపీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండకుండా వివాహం చేయడం చట్ట విరుద్ధమని, చిన్నతనంలో వివాహం చేసి వారి బంగారు భవిష్యత్‌ను నాశనం చేయవద్దన్నారు. బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో కమలాదేవి, వైద్యులు మీరజ్, నందన, మానస, లయన్స్ క్లబ్ సభ్యులు శ్రీదేవి, శారద, సునిత, శోభ, పోలీసులు, తదితరులు ఉన్నారు.

సత్యసాయిబాబా సేవలు స్ఫూర్తిదాయకం

- ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు


బాబా మందిరంలో పూజలు చేస్తున్న రవీందర్‌రావు

కురవి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : భగవాన్ సత్య సాయి సేవలు స్ఫూర్తిదాయకమని, ఆయన భక్తిభావాన్ని, సేవాగుణాన్ని ప్రతీ ఒక్కరు ఆచరించాలని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం కురవిలోని సత్యసాయి బాబా మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాయిబాబా మానవసేవయే.. మాధవసేవ అని ఎన్నో లక్షల మందికి ఆయన స్థాపించిన ట్రస్టు ద్వారా సేవలందించారని కొనియాడారు. కరువుకాటకాల్లో అనంతపురం జిల్లా మొత్తానికి మంచినీరు అందించిన ఘనత సొంతం చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి మండల అధ్యక్షుడు సీహెచ్.శ్రీనివాస్, కురవి దేవాలయ మాజీ చైర్మన్ బి.రాజునాయక్, గుగులోతు రవినాయక్, జెర్రిపోతుల వెంకన్న, గండెపల్లి తిరుమల్‌రావు, గండెపల్లి యశ్వంత్, కొంతం విజయ్, వేమిశెట్టి సంతోష్, నర్సయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు నేరవేర్చాలి


మాట్లాడుతున్న టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్

కురవి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్ డిమాండ్ చేశారు. కురవిలో శనివారం మండల అధ్యక్షుడు గుండ్ల విజయ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ఆ ప్రభుత్వాన్ని ఓడించామని, కొత్తగా వచ్చిన ప్రభుత్వం సైతం ఉద్యోగ, ఉపాధ్యాయులను మనోవేదనకు గురి చేస్తుందని ఆరోపించారు. ఎన్నికలకు ముందు ఉపాధ్యాయులకు నగదు రహిత వైద్యవిధానాన్ని అమలు చేస్తామని చెప్పి, ఇంత వరకు మార్గదర్శకాలు విడుదల చేయకపోవడం శోచనీయమన్నారు. 2010 కంటే ముందు ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చిన సీనియర్లను టెట్ నుంచి మినహాయించాలని డిమాండ్ చేశారు. 2024 నుంచి పదవీవిరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు.

ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలను చెల్లించి జూలై 2023 నుంచి అమలు చేయాల్సిన పీఆర్సీ అమలుపై మార్గదర్శకాలు విడుదల చేయాలన్నారు. ఈనెల 24న గిరిజన ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ ఎదుట జరిగే నిరసనను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ నాయకులు ఓదేల శివకుమార్, బుక్క వీరేందర్, గుగులోతు వెంకన్న, శ్రీనివాస్, వీరేందర్, వెంకటేష్ పాల్గొన్నారు.

(5వ పేజీ తరువాయి)

ఉత్కంఠ.!

16 మండలాల్లో 461 గ్రామపంచాయతీలకు గాను షెడ్యూల్డ్ ఏరియాలో ఉన్న 102 గ్రామపంచాయతీలను షెడ్యూల్డ్ ట్రైబ్స్ (ఎస్టీ)కు రిజర్వు చేశారు. అదే రీతిన వందశాతం ఎస్టీల జనాభా ఉన్న మరో 115 గ్రామపంచాయతీలను కూడా ఎస్టీలకే రిజర్వు చేశారు. మిగిలిన నాన్ షెడ్యూల్డ్ గ్రామపంచాయతీలు 244గా గుర్తించారు. ఇందులో ఎస్టీలకు 58 గ్రామపంచాయతీలు, ఎస్సీలకు 42 పంచాయతీలు, బీసీలకు 22 పంచాయతీలు, మిగిలిన 122 పంచాయతీలు జనరల్‌కు రిజర్వు చేశారు. మొత్తానికి అన్నింట్లోనూ 50 శాతం మహిళలకు రిజర్వేషన్ ఇచ్చారు. రేపటి ఎన్నికల్లో ఈ గణాంకాలు పూర్తిగా మారిపోతున్నాయి.

మొత్తం ఓటర్లు మొత్తం 5,56,780 మంది..

జిల్లాలో ఓటర్లు మొత్తం 5,56,780 మంది ఉన్నారు. ఇందులో అత్యధికంగా మహిళలు 2,83,064గా తేలారు. పురుషులు 2,73,692 కాగా, ఇతరులు 24 మంది ఉన్నారు. మొత్తం 18 మండలాల్లో 482 గ్రామపంచాయతీలకు గాను 4110 వార్డులు తీశారు. వీటికి సంబంధించి ఆది, సోమవారాల్లో తాజా మార్గదర్శకాల ప్రకారం. రిజర్వేషన్లు ఖరారు చేయనున్నారు. మొత్తంగా ఆదివారం తొలుత అన్ని పంచాయతీల్లో అన్ని రిజర్వేషన్లకు సంబంధించి మహిళలకు 50 శాతం కేటాయింపులు చేస్తారు. ఆదే క్రమంలో వందకు వందశాతం ఎస్టీలు ఉన్న గ్రామాల్లో సర్పంచ్‌లు, వార్డులు అన్ని వారికే కేటాయిస్తారు. మిగిలిన గ్రామాలకు సంబంధించి కూడ తొలుత ఎస్టీ రిజర్వేషన్లు ఖరారు చేసి ఆపై ఎస్సీ, బీసీలకు కేటాయిస్తారు. మిగిలినవి జనరల్ కేటగిరిలో ఉంటాయి.

రిజర్వేషన్ల కేటాయింపులు ఇలా..

యాభైశాతం మించకుండా సుప్రీంకోర్టు ఆదేశాలకనుగుణంగా చేపడుతున్న పంచాయతీ ఎన్నికల ప్రక్రియలో సర్పంచ్‌ల రిజర్వేషన్లను ఆర్డీవోలు, వార్డు సభ్యుల రిజర్వేషన్లను ఎంపీడీవోలు చేయాల్సి ఉంది. మహబూబాబాద్ ఆర్డీవో కార్యాలయంలో బయ్యారం, డోర్నకల్, గం గారం, గార్ల, గూడూరు, ఇనుగుర్తి, కేసముద్రం, కొత్తగూడ, కురవి, మహబూబాబాద్, సీరోలు మండలాలకు చెందిన 294 సర్పంచ్ స్థానాలకు రిజర్వేషన్లను తీస్తారు. అదేరీతిన తొర్రూరు ఆర్డీవో కార్యాలయంలో చిన్నగూడూరు, దంతాలపల్లి, మరిపెడ, నర్సింహులపేట, నెల్లికుదురు, పెద్దవంగర, తొర్రూరు మండలాలకు చెందిన 188 సర్పంచ్‌లకు రిజర్వేషన్లు తీస్తారు. ఆపై ఆయా మండలాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో సంబంధిత మండలాలకు సంబంధించిన గ్రామపంచాయతీల వార్డులకు రిజర్వేషన్లు తీస్తారు. ఆయా రిజర్వేషన్లపై అన్ని గ్రామాల్లో ఉత్కంఠత కొనసాగుతోంది.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

12 మందిపై కేసు నమోదు

బయ్యారం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం రాత్రి మెరుపు దాడి చేశారు. ఈ దాడిలో కార్లు, బైక్స్, మొబైల్స్ ఫోన్లు, పేక ముక్కలతో పాటు నగదు స్వాధినపరుచుకోగా, పేకాట ఆడుతున్న పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మెహబూబీ పేర్కొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. గంధంపల్లి గ్రామంలోని ఓ ఇంట్లో పలువురు పేకాట ఆడుతున్నట్లు అందిన నమ్మదగ్గ సమాచారం మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్ ఎస్సై కుషక్‌కుమార్ నేతృత్వంలో సిబ్బంది దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న 12 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ దాడిలో పేకాటరాయుళ్ల నుంచి రూ. 17.800 నగదుతో పాటు 11 ఫోన్లు, రెండుకార్లు, మూడుబైక్స్‌తో పాటు 52 పేక ముక్కలు స్వాధీనపరుచుకున్నట్లు ఎస్సై వెల్లడించారు.

వీరభద్రస్వామి సన్నిధిలో మహారాష్ట్ర బీజేపీ ఎంపీ పూజలు


ఎంపీ అనిల్‌సుక్దేవ్‌రావు బోండేతో బీజేపీ నాయకులు

కురవి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కురవి వీరభద్రస్వామి దేవాలయంలో మహారాష్ట్రకు చెందిన రాజ్యసభ సభ్యుడు (ఎంపీ) అనిల్‌సుక్దేవ్‌రావు బోండే శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన ఆయనకు బీజేపీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. వీరభద్రస్వామి, భద్రకాళి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపిన అనంతరం ఆయన మాట్లాడుతూ చారిత్రక వీరభద్రస్వామి దేవాలయాన్ని దర్శించుకోవడం తన అదృష్టమన్నారు. ఆయన వెంట జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్‌రావు, గుగులోతు శంకర్‌నాయక్, దేవిక, కొంతం పెంటయ్య పాల్గొన్నారు.

'తేనెటీగల పెంపకం మేలు'

కాటారం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): వ్యవసాయరంగానికి అనుబంధంగా శాస్త్రీయ పద్ధతి లో తేనెటీగల పెంపకం ప్రయో జనకరంగా ఉంటుందని స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాష్‌రెడ్డి అన్నారు. కాటారం ఏఎంసీ కార్యాలయంలో ఎన్‌బీబీ (నేషనల్ బీ బోర్డ్)సహ కారంతో ఎన్‌ఐపీహెచ్‌ఎం ఆధ్వ ర్యంలో తేనెటీగల పెంపకంపై జరుగుతున్న ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ఏఎంసీ చైర్‌పర్స న్ పంతకాని తిరుమలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు వ్యవసాయంతో పాటు అనుబంధరంగాల్లోనూ రా ణించి ఆదాయం పెంపొందించుకోవాలని సూచించా రు. తేనెటీగల పెంపకం, తేనెసేకరణ, విక్రయాలతో ప్రజలకు ఉపాధి లభిస్తుందన్నారు. తేనెటీగల పెంపకంపై నిర్వాహకురాలు సంజన పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఎన్‌ఐపీహెచ్‌ఎం ఏడీ జ్యోతి, కాంగ్రెస్ నేతలు, రైతులు కుంభం రమేష్‌రెడ్డి, రాజేంద్ర ప్రసాద్, ఖలీల్‌పాషా, వెంకయ్య తదితరులు ఉన్నారు.

బీసీల ఆశలు గల్లంతు

- 42 శాతం అమలు లేక సగం తగ్గిన సీట్లు
- పాత రిజర్వేషన్ల విధానంతో నిరాశ
- నిరుత్సాహంలో ఆశావహులు



హనుమకొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): 50 శాతం మించకుండా రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు పంచాయతీ రాజ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో గతంలో ప్రకటించినట్లు 42 శాతం రిజర్వేషన్లు అమలైతే అదనంగా లభించే సీట్లను బీసీలు గణనీయంగా కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో బీసీ స్థానాల్లో పోటీ చేయాలనుకున్న ఆశావహుల్లో తీవ్ర నిరాశ నెలకొన్నది. అక్టోబరులో ప్రకటించిన రిజర్వేషన్ల ప్రకారం బీసీలకు రిజర్వు అయిన స్థానాల్లో పోటీకి నేతలు అప్పటి నుంచే సిద్ధమయ్యారు. ఓటర్లను ఆకట్టుకునేందుకు పెద్దఎత్తున ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఓటర్లను వ్యక్తిగతంగా కలుసుకోవడం, మద్దతుదారులను కూడగట్టుకోవడంలో బిజీ అయిపోయారు. కానీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను చట్టబద్ధంగా అమలు విషయంలో సుప్రీంకోర్టు, హైకోర్టు ఇచ్చిన తీర్పుల నేపథ్యంలో బీసీల ఆశలు గల్లంతయ్యాయి. గతంలో మాదిరిగానే 50శాతం మించకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లు అమలు చేయాల్సి రావడంతో బీసీ ఆశావహులు పోటీ చేయడానికి సిద్ధపడుతున్న స్థానాల రిజర్వేషన్ మారే పరిస్థితి ఏర్పడింది.

ఉదాహరణకు హనుమకొండ జిల్లాలో 205 గ్రామ పంచాయతీల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలైతే 86 స్థానాల్లో వారు పోటీ చేసే అవకాశం ఉండేది. కానీ ఇప్పుడు పాత రిజర్వేషన్ ప్రకారం అయితే 45 నుంచి 47 స్థానాలకు మించి పోటీ అవకాశం లేదు. దీని వల్ల బీసీలు సుమారు 41 సీట్లను కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. డెడికేటెడ్ కమిటీ సర్వే నివేదిక ప్రకారం జిల్లాలో తాజాగా ఎస్సీ జనాభా దామాషా ప్రకారం 50 నుంచి 52 స్థానాల్లో పోటీకి అవకాశం ఉండగా ఎస్టీలకు వారి జనాభా దామాషా ప్రకారం 3 స్థానాలకు మించి దక్కేట్టు లేదు. బీసీల విషయానికి వస్తే జనాభా దామాషా ప్రకారం కాకుండా పాత రిజర్వేషన్ ప్రకారం 45 నుంచి 47 స్థానాల్లో మాత్రమే పోటీకి అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. మిగిలిన 105 అన్‌రిజర్వేడ్ స్థానాల్లో 50 శాతం మహిళలకు రిజర్వుకాగా మిగతా 50 శాతం సీట్లలో ఉవరైనా పోటీ చేయవచ్చు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మొత్తం 1,708 గ్రామ పంచాయతీల్లో రాష్ట్ర ప్రభుత్వం ఇంతకు ముందు ప్రకటించినట్లు 42 శాతం రిజర్వేషన్ ప్రకారం అయితే బీసీలు 717 పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు పోటీ చేసే అవకాశం ఉండేది. కానీ పాత రిజర్వేషన్ ప్రకారం ప్రస్తుతం సుమారుగా 393 స్థానాల్లో పోటీకి అవకాశం ఉంది. అంటే 324 స్థానాల్లో పోటీ చేసే అవకాశం జారీ పోయినట్టు భావించాల్సి వస్తోంది. పార్టీ గుర్తులు లేకుండా జరిగే పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్న సంకల్పంతో కాంగ్రెస్ మద్దతుతో బీసీ అభ్యర్థులు జనరల్ స్థానాల్లో పోటీ చేయగలిగితే వారి సంఖ్య పెరగవచ్చు.

నేతల్లో ఉత్కంఠ

తమ ఊరి సర్పంచ్ రిజర్వేషన్ దేనికి ఖరారవుతుం దనే ఉత్కంఠ గ్రామాల్లో నెలకొన్నది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో సుప్రీంకోర్టు, హైకోర్టుల తీర్పుల నేపథ్యంలో పంచాయతీ ఎన్నికల్లో పాత రిజర్వేషన్ల విధానానికి జిల్లా యంత్రాంగాలు కసరత్తు చేస్తున్న నేపథ్యంలో రిజర్వేషన్ల ప్రకటనపై నేతలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఈ నెలాఖరులోపు షెడ్యూల్ వెలువడుం తుందనే ప్రచారం జోరందుకున్న తరుణంలో అధికారు లు కూడా 2019 పంచాయతీ ఎన్నికల్లో అమలు చేసిన రిజర్వేషన్ల ప్రకారమే 50 శాతాన్ని మించకుండా ప్రక్రియను కొనసాగిస్తున్న నేపథ్యంలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేయడానికి సన్నద్ధమవు తున్న ఆశావహుల్లో ఆందోళన నెలకొన్నది. బీసీ డెడికే టెడ్ కమిషన్ నివేదిక ఆధారంగా రిజర్వేషన్ల ఖరారు చేయాలని చెప్పడంతో ఈసారి ఆరు జిల్లాల్లో మార్పులు చేర్పులు ఉండవచ్చునని భావిస్తున్నారు. పోటీ చేయాలనుకుంటు న్న ఆశావహులంతా అధికారిక ప్రకటన కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. గత నెలలో ప్రకటించిన రిజర్వేషన్లలో బీసీ స్థానాల్లో చాలా వరకు అన్ రిజర్వుడ్ కానున్నాయి.

శిలాఫలకాల ధ్వంసం

- అర్ధరాత్రి కూల్చిన గుర్తు తెలియని వ్యక్తులు
- ఇది బీఆర్ఎస్ పనేనని కాంగ్రెస్ ఆరోపణ
- తాము కాదంటున్న బీఆర్ఎస్ నాయకులు
- కొడకండ్లలో రెండు చెక్‌డ్యామ్‌ల శిలా ఫలకాల ధ్వంసంపై రచ్చ

కొడకండ్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా కొడకండ్ల మండలంలో శుక్రవారం ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి శంకుస్థాపన చేసిన రెండు చెక్‌డ్యామ్‌ల శిలాఫలకాలను గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి ధ్వసం చేయడం స్థానికంగా రాజకీయ వేడిని రాజేసింది. ఇది బీఆర్ఎస్ పనేనని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తుండగా, నిజానిజాలు తెలుసుకోకుండా మాట్లాడడం విడ్డూరంగా ఉందని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఒకరిపైఒకరు ఆరోపణ, ప్రత్యారోపణలు చేసుకుంటున్నారు. ఈ ఘటనపై మండలంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ ఘటనపై స్పందించిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేష్ నాయక్, శిలా ఫలకాలను బీఆర్ఎస్ నాయకులే కూల్చారని నేరుగా ఆరోపించారు. సురేష్ నాయక్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నాయకులు, వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ పేరం రాము స్పందించారు. శిలాఫలకం ఎవరు కూల్చారో తెలుసుకోకుండా బీఆర్ఎస్‌పై బురదజల్లడం సరి కాదన్నారు. కూల్చేంత కర్మ బీఆర్ఎస్‌కు లేదన్నారు. కాంగ్రెస్‌లోనే రెండు వర్గాలుగా విడిపోయి కొట్టుకుంటున్న వాళ్లే కూల్చేసి ఉంటారని పేర్కొన్నారు. సురేష్ నాయక్ మతిభ్రమించి మాట్లాడుతున్నారు అని ఎద్దేవా చేశారు.

● పాలకుర్తి: బీఆర్ఎస్ ప్రభుత్వంలో చెక్‌డ్యాంల నిర్మాణానికి మంజూరైన నిధులను తాము మంజూరి చేసినట్లు కాంగ్రెస్ ఖాతాలో వేసుకోవడం సిగ్గుచేటని ఆ పార్టీ మండల కమిటీ విమర్శించింది. శనివారం మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, మాజీ ఎంపీపీ నల్ల నాగిరెడ్డి మాట్లాడుతూ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కృషితో వల్మిడి, ముత్తారం గ్రామాల్లో చెక్‌డ్యాంల నిర్మాణానికి 2023లోనే నిధులు మంజూరు చేశారన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వమే మంజూరి చేసిందని కాంగ్రెస్ నాయకులు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి గతంలో మంజూరైన ప్రొసీడింగ్‌ను మార్చి ఈ ప్రభుత్వంలోనే మంజూరైనట్లు కొత్త ప్రొసీడింగ్ ద్వారా నిధులు మంజూరి చేయించినట్లు శంకుస్థాపన చేశారని అన్నారు. సమావేశంలో ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ బొబ్బాల అశోక్‌రెడ్డి, పుస్కూరి కళింగరావు, వీరమనేని సోమేశ్వర్‌రావు, గూడ దామోదర్, మహేందర్ నాయక్, గణేష్, కత్తి సైదులు, సోమయ్య, పంగ సైదులు, కర్నాకర్‌రెడ్డి, పాము శ్రీనివాస్, కొంరెల్లి ఉన్నారు.


కూల్చివేసిన శిలా ఫలకాన్ని చూపుతున్న కాంగ్రెస్ నాయకులు


పాలకుర్తిలో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు


కేసముద్రం రైల్వేస్టేషన్ వద్ద వివరాలు తెలుసుకునేందుకు వచ్చిన అయ్యప్ప మాలధారులు

ప్రత్యేక రైళ్లు ఏవి 'స్వామి'?!

- శబరిమలకు వెళ్లేందుకు అందుబాటులో లేని స్పెషల్ ట్రైన్లు
- ఉమ్మడి జిల్లా నుంచి ఒకే ఒక్కరైలు
- మాలధారుల ఎదురుచూపులు

కేసముద్రం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్పమాల ధరించిన ప్రతిఒక్కరూ శబరిమలలోని స్వామివారిని దర్శించుకోవడం ప్రధానమైన అంశంగా భావిస్తారు. ఈ ప్రాంతం నుంచి శబరిమలకు వెళ్లేందుకు ప్రత్యేక రైళ్లు అందుబాటులో లేకపోవడంతో వేలాది మంది అయ్యప్ప మాలధారులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కాలం (41 రోజులు) అయ్యప్ప దీక్షాపరులు శబరిమలకు వెళ్లి స్వామి దర్శనం చేసుకోవడమే దీక్షకు ముగింపని మాలధారుల నమ్మకం. శబరిమల యాత్రలో భక్తులకు సహనం, నియమాలు, కష్టపడడం, భక్తి, ఇతరుల పట్ల వినయం ఏర్పడి అధ్యాత్మిక అనుభవం వస్తుంది.

'స్వామియే శరణం అయ్యప్పా' అంటూ లక్షలాది మంది భక్తుల సమూహం వెళ్లడం కూడా ప్రత్యేక శక్తిని ఇస్తుందని భక్తులు నమ్ముతుంటారు. ఈ నేపథ్యంలో ప్రతీ ఏటా మాలధారణ చేసిన వారు నవంబర్ 16 నుంచి డిసెంబర్ 27 వరకు నిర్వహించే మండల పూజా మహోత్సవం, డిసెంబర్ 30 నుంచి జనవరి 20 వరకు మకరవిళక్కు ఉత్సవం సందర్భంగా ఈ దర్శనాలు చేసుకునేందుకు ప్రధానంగా భావిస్తూ దీక్షాపరులు లక్షల మంది పోటెత్తుతారు. అత్యంత పవిత్రంగా భావిస్తూ ప్రత్యేకంగా మకర సంక్రాంతిన మకర జ్యోతి దర్శనం కోసం అయ్యప్పస్వాములతో శబరిమల కిక్కిరిసిపోతుంది.

ఈ ప్రాంతం నుంచి ఒకేఒక ప్రత్యేక రైలు

మహబూబాబాద్ జిల్లాతో పాటు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది అయ్యప్ప మాలధారులు శబరిమలకు వెళ్లేందుకు ఈ ప్రాంతం మీదుగా రైల్వేశాఖ ఒకే ఒక్క రైలును నడుపుతోంది. చెర్లపల్లి నుంచి వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, విజయవాడ, తిరుపతి మీదుగా కేరళకు సోమ, శుక్రవారాల్లో నడిచే చెర్లపల్లి-కొట్టాయం (07115/07116) ప్రత్యేక రైలు ఒక్కటే ఈ ప్రాంత భక్తులకు అందుబాటులో ఉంది. మిగతా రైళ్లన్నీ చెర్లపల్లి నుంచి నడికుడి జంక్షన్, గుంటూరు, తిరుపతి మీదుగా కేరళ వెళ్తున్నాయి.

వరంగల్, మహబూబాబాద్ నుంచి శబరిమలకు వెళ్లేందుకు కేరళలోని కొట్టాయం, చెంగనూరు రైల్వేస్టేషన్లకు భక్తులు చేరుకోవాల్సి ఉంటుంది. సాధారణంగా నడిచే ఎక్స్‌ప్రెస్ రైళ్లలో రిజర్వేషన్లు ఫుల్ అవుతుండగా ప్రత్యేక రైళ్లలో 15 నుంచి నెల రోజుల ముందు నుంచే రిజర్వేషన్ చేసుకునే అవకాశాన్ని ఇస్తున్నారు. ఈ నెల 16 నుంచి మండల పూజా మహోత్సవాలు ప్రారంభం కావడంతో భక్తులు శబరిమలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో ప్రత్యేక రైళ్లు అందుబాటులో లేకపోవడంతో అయ్యప్ప మాలధారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా రైల్వేశాఖ మహబూబాబాద్ ప్రాంతం నుంచి ప్రత్యేక రైళ్లను నడపాలని అయ్యప్ప దీక్షాపరులు కోరుతున్నారు.

వరంగల్ నగరాభివృద్ధికి కృషి

- ఎంపీ కడియం కావ్య
- ఉనికిచర్లలో ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం :
- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి


ఉనికిచర్ల నగర పంచాయతీలో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి తదితరులు

ధర్మసాగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగర అభివృద్ధి కోసం అందరి సహకారంతో కృషి చేస్తున్నట్లు ఎంపీ కడియం కావ్య అన్నారు. శనివారం ధర్మసాగర్ మండలం ఉనికిచర్ల నగర పంచాయతీలో కుడా యూనిసిటీ వెంచర్ అభివృద్ధి, రూ.10 కోట్లతో చేపడుతున్న డబుల్ బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఎంపీ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కావ్య మాట్లాడుతూ ఇప్పటికే నగరానికి ఎయిర్‌పోర్టు, కోచ్ ఫ్యాక్టరీ, టెక్స్‌టైల్ పార్కు, స్పోర్ట్స్ స్కూల్‌తో పాటు నగర ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న అండర్ డ్రెయినేజీ నిర్మాణం, అభివృద్ధి పనులకు రూ.4 కోట్లు మంజూరైనట్లు తెలిపారు.

ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ వెంచర్ వరకు నిర్మించే నాలుగు లైన్ల బీటీ రోడ్డును ఉనికిచర్ల గ్రామం వరకు పొడిగించాలని కోరారు. ఇదే గ్రామంలో ఇంటర్ నేషనల్ క్రికెట్ స్టేడియం రాబోతుందన్నారు. భవిష్యత్‌లో ఈ రహదారిని ఉనికిచర్ల నుంచి రాపాకపల్లి, దేవునూర్ గుట్టల వరకు నిర్మించనున్నట్లు తెలిపారు. దేవునూర్ గుట్టలను ఎకో టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక చేస్తున్నట్లు చెప్పారు. పట్టణ ప్రాంత ప్రజలు హాలీడేస్‌లలో సేద తీరేందుకు ఆక్సీజన్ పార్కు, ట్రెక్కింగ్, రాత్రి బస చేసేందుకు రిసార్ట్ వంటి సదుపాయాలను కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో అనిల్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రసాద్, ప్రదీప్ కుమార్, రఘు, రాజు, మండల ఉపాధ్యక్షులు వక్కల రవీందర్, కందుకూరి సుధాకర్ పాల్గొన్నారు.

స్పీకర్ నిర్ణయాకి కట్టుబడి ఉంటా..

రాజీనామా విషయంలో స్పీకర్ నిర్ణయాన్ని బట్టి తన నిర్ణయం ఉంటుందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. నవంబరు 23 లోపు పార్టీ ఫిరాయింపుల ఆరోపణలపై వివరణ ఇవ్వాలని స్పీకర్ నోటీసులు ఇచ్చారన్నారు. దానిపై మరింత సమయం కావాలని స్పీకర్‌ను కలిసి కోరడం జరిగిందన్నారు. దీనిపై స్పీకర్ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్ పార్టీతో కలిసి పని చేస్తున్నట్టు వెల్లడించారు. ఉపఎన్నిక వస్తే పోటీ చేసేది కడియం శ్రీహరే.. ప్రజలు గెలిపించేది కూడా శ్రీహరినే.. అని ధీమా వ్యక్తం చేశారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీబీ నిర్మలా గీతాంబ

హసన్‌పర్తి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన మానవ జీవితమే శ్రేష్ఠమైనదని, ప్రతీ విద్యార్థికి విలువలతో కూడిన విద్య అందించాలని వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి.నిర్మలాగీతాంబ అన్నారు. భీమారం ఎస్‌వీఎస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ ఆవరణలో 'విద్యార్థులకు చట్టాలపై అవగాహన - యువతపై ప్రభావం' అనే అంశంపై నార్కోటిక్స్, పీవోసీఎస్‌వో, యాంటీ ర్యాగింగ్, స్ట్రెస్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి.నిర్మలాగీతాంబ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా మంచి భవిష్యత్తును పునర్నిర్మించుకోవాలని సూచించారు. ర్యాగింగ్ చట్ట వ్యతిరేకమని, ర్యాగింగ్‌కు పాల్పడితే కఠినమైన శిక్షలు ఉన్నందున ర్యాగింగ్‌కు పాల్పడి తమ ఉజ్వలమైన భవిష్యత్తును కోల్పోవద్దన్నారు.

వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.సాయికుమార్, హనుమకొండ సీనియర్ సివిల్ న్యాయమూర్తి వి.ఉషాక్రాంతి, హనుమకొండ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పులి సత్యనారాయణ, ఎస్‌వీఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ అజేంద్రకుమార్ రాథోడ్, కౌన్సిలర్ నీరజ, హెల్పింగ్ హ్యాండ్ ఎన్‌జీవో డి అడిక్షన్ కౌన్సిలర్ కె.రజిత మాట్లాడుతూ మానవుడు మనిషిలాగా జీవించగలిగితే ఈ సమాజంలో పోలీసు స్టేషన్లు, కోర్టులు, రాజకీయ నాయకుల అవసరం ఉండదన్నారు.

సీనియర్ సివిల్ జడ్జి కె.పూజిత మాట్లాడుతూ విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎటువంటి న్యాయ సలహాలకైనా, సమస్యలున్నవారు 15100 టోల్ ఫ్రీ నెంబరు ద్వారా ఉచితంగా న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వీఎస్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు, వైస్ చైర్మన్ డాక్టర్ ఇ.సువర్ణ, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు



శుభకార్యాలకు విరామం

- 3 నెలల పాటు ముహూర్తాలు నిల్
- ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 17 వరకు శుక్ర మౌఢ్యం
- 83 రోజుల తర్వాతే ఫంక్షన్లు

వెంకటాపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రహాల స్థితిని బట్టి.. ఖర్మ కాలాలు లేదా మౌఢ్య సమయాలు లాంటివి జ్యోతిష్య శాస్త్రం ద్వారా వినిపించే మాటలు.. ఈసారి దాదాపు మూడు నెలల పాటు శుభముహూర్తాలకు విరామం రానుంది. ఈ నెల మార్గశిర శుద్ధ సప్తమి 28న ప్రారంభం కానున్న శుక్ర మౌఢ్యమి (మూఢం) మాఘ బహుళ అమావాస్య ఫిబ్రవరి 17 వరకు కొనసాగనుంది. దీంతో 83 రోజుల పాటు శుభకార్యాలకు సెలవు ప్రకటించాల్సిందే.

పవిత్ర తిథులు..

మార్గశిర, మాఘ, ఫాల్గుణ మాసాల్లో శుభకార్యాలు అధికంగా జరుగుతాయి. ఈ సారి మార్గశిరంలో ఒకటి, రెండు ముహూర్తాలు మాత్రమే ఉండగా, పుష్య మాసం శూన్యమాసం అవుతుంది. ఇక మాఘ మాసంలోనూ ఒక్క ముహూర్తం లేకపోవడం గమనార్హం. గృహప్రవేశాలకు అనుకూలమైన రథసప్తమి, సరస్వతి జన్మదినమైన వసంత పంచమి మహా మాఘీగా కీర్తించబడే మాఘ పౌర్ణమి వంటి తిథులు ఈ సారి మూఢంలోనే కలిసిపోతున్నాయి.



ఒక్క ముహూర్తం లేదు..

ఎం. రఘునాథచార్యులు, పురోహితుడు



ఈ నెల 28 నుంచి 2026 ఫిబ్రవరి 17 వరకు దాదాపు మూడు నెలల పాటు శుభకార్యాలకు మంచి రోజులు లేవు. శుక్ర మౌఢ్యం వల్ల ఒక్క శుభ ముహూర్తం ఉండదు. వివాహాలతో పాటు గృహప్రవేశాలు, విగ్రహ ప్రతిష్ఠాపనలు, అఖరికి వరపూజల వంటి కార్యాలు కూడా చేసుకోకూడదు. వైదిక పురోహితులకు ఈ మూడు నెలలు గడ్డుకాలమే.

వ్యాపారాలపై ప్రభావం

శుభకార్యాలు లేకుంటే వివాహ మండపాలు, ఫంక్షన్‌హాళ్లు, వస్త్రదుకాణాలు, నగల షాపుల యజమానులు, స్వర్ణకారులు, క్యాటరింగ్, డెకరేషన్, ఫొటో, వీడియోగ్రాఫర్లు, టెంట్‌హౌస్, పూల దుకాణాలు, లైటింగ్, డీజే, అద్దె కార్లు, బస్సులు వంటి సంబంధిత రంగాల వ్యాపారులు నెల కొద్దీ నష్టపోవాల్సి వస్తుంది. పౌరోహిత్యంపై ఆధారపడ్డ వారికి గడ్డుకాలమే.

మూఢం అంటే..

జ్యోతిష్య శాస్త్రం ప్రకారం ఒక గ్రహం సూర్యుడి కిరణాల్లో కనుమరుగై పోవడాన్ని మూఢం అంటారు. గ్రహశక్తులు బలహీనమవడంతో శుక్ర గ్రహం సూచించే ఫలితాలు అంతగా అనుకూలంగా ఉండవు. శుభకార్యాలకు గురుడు ఎంత ప్రధాన కారకుడో, శుక్రుడు అంతే ప్రభావం కలవాడు. శుక్రుడు బలహీనమైతే సంబంధాలు, వివాహ జీవితం, ఆర్థిక స్థిరత్వం వంటి విషయాల్లో ప్రతికూలతలు ఏర్పడుతాయని జ్యోతిష్యులు చెబుతున్నారు. అందుకే శుక్ర మౌఢ్యం ఉన్న కాలంలో శుభకార్యాలు జరిపించడం శుభ సూచికం కాదని సూచిస్తున్నారు.

ప్రపంచంలో ప్రతి విద్యార్థి అద్భుతమైన శక్తే

- నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి
- వరంగల్ నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి

హసన్‌పర్తి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో ప్రతి విద్యార్థి ఒక అద్భుతమైన శక్తేనని, తనలోని నైపుణ్యాలను మెరుగుపర్చుకోగలిగితే గొప్ప వ్యక్తిగా రాణించగలడని వరంగల్ నిట్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి అన్నారు. మండలంలోని ఎర్రగట్టు గుట్ట కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్లే ఫీల్డ్‌లో ప్రిన్సిపాల్ కె.అశోక్‌రెడ్డి అధ్యక్షతన కిట్స్ 8వ అటానమస్ 2021-25 బ్యాచ్ 42వ యాన్యువల్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా వరంగల్ నిట్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుద్ది అగస్టు, గౌరవ అతిథిగా కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం, కిట్స్ గవర్నింగ్ బాడీ చైర్మన్ కెప్టెన్ లక్ష్మీకాంతరావు, కోశాధికారి పి.నారాయణరెడ్డి, కిట్స్ డైరెక్టర్, మాజీ ఎమ్మెల్యే వి.సతీష్‌కుమార్, ప్రిన్సిపాల్ కె.అశోక్‌రెడ్డిలు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా అకాడమిక్ అండ్ కో కరికులర్ ఆక్టివిటీలలో అత్యుత్తమ ప్రతిభకనబర్చిన 16 మంది విద్యార్థులకు బంగారు పతకాలను, 15 అకాడమిక్ మెరిట్ అవార్డులు, డిగ్రీలు, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ గ్రాండ్ అంట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కిట్స్ వరంగల్ రిజిస్ట్రార్ ఎం.కోమల్‌రెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ వి.రాజగోపాల్, అకాడమిక్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ కె.వేణుమాధవ్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బి.కిరణ్‌కుమార్, డాక్టర్ ఎస్.ఉమామహేశ్వర్, డాక్టర్ డి.రాజయ్య, యూజీ కోర్సు ల ఇన్‌చార్జి ఫ్యాకల్టీ డాక్టర్ పి.ప్రభాకర్‌రావు, పీజీ కోర్సుల ఇన్ చార్జి ఫ్యాకల్టీ డాక్టర్ ఆర్.శ్రీకాంత్, అసోసియేట్ ప్రొఫెసర్ డి.ప్రభాకరచారి, వి.కిషన్‌రావు, వెంకట్రాంరెడ్డి, దేవీప్రసాద్, ఎ.సత్యనారాయణరాజు, డాక్టర్ వి.పవన్, కె.ప్రతాప్‌రెడ్డి, ఎ.హరీష్, వి.శ్రీరాంరావు, వివిధ విభాగాధిపతులు, డీన్స్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పంచాయతీ రిజర్వేషన్లపై కసరత్తు

(5వ పేజీ తరువాయి)

ఎంపీడీవోలు మిగిలిన రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేసి ఆయా ప్రతులను సంతకాలు చేసి డీపీవోకు అందజేస్తారు. వీటిని కలెక్టర్ పునఃపరిశీలించి ఎన్నికల షెడ్యూల్‌ను బట్టి గెజిట్‌లో అధికారికంగా ప్రకటిస్తారు.

గిరిజన గ్రామాల్లో..

మహబూబాబాద్, ములుగు జిల్లాలో గిరిజన గ్రామాలే ఎక్కువగా ఉన్నాయి. ఇలాంటి గిరిజన గ్రామాలు ఎక్కువ ఉన్న జిల్లాల్లో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలను ఎస్టీలకు రిజర్వు చేస్తారు. మిగిలిన పంచాయతీలను ఎస్టీ ఎస్సీ, బీసీ, జనరల్‌కు రిజర్వు చేయాల్సి ఉంటుంది. వీటిల్లో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించినవి పోను మిగిలిన వాటిని డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఆధారంగా ఖరారు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ముమ్మరంగా ఏర్పాట్లు

ఒక పక్క రిజర్వేషన్ల ఖరారుకు కసరత్తు జరుగుతుండగా మరో పక్క ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు జోరందుకున్నాయి. ఎన్నికల షెడ్యూల్ త్వరలో వెలువడే అవకాశాలు ఉండడంతో అధికారులు ఎన్నికల ఏర్పాట్లలో తలమునకలయ్యారు. తప్పులు సరవరించిన పల్లె ఓటర్ల తుది జాబితాను ఈ నెల 23వ తేదీన విడుదల చేయనున్నారు. ఇప్పటికే అవసరమైన బ్యాలెట్ పెట్టెలను అందుబాటులోకి తెచ్చారు. ముద్రణ సామగ్రిని గతంలోనే సిద్ధం చేశారు. పోలింగ్ కేంద్రాలను కూడా గుర్తించారు. అవసరమైన బ్యాలెట్ పేపర్ల ముద్రణ దాదాపు పూర్తి కావచ్చింది. తాజాగా కలెక్టర్లు నోడల్ అధికారులను కూడా నియమించారు.

‘లేబర్‌కోడ్ అమలు నోటిఫికేషన్‌ను రద్దు చేయాలి’

మహబూబాబాద్ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల విన్నపాలను పెడచెవిన పెట్టి విడుదల చేసిన లేబర్‌కోడ్ అమలు నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ పట్టణంలోని కార్మికుల అడ్డాలో శనివారం సీఐటీయూ ఆశ్వర్యంలోనిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సంపదను సృష్టించే కార్మికులను కట్టుబానిసలుగా మార్చేందుకు బీజేపీ ప్రభుత్వం తహతహలాడుతుందని విమర్శించారు. పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేందుకు కుట్రలు పన్నుతుందని ఆరోపించారు. నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని లేని పక్షంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు.



మానుకోటలో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నేతలు

జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు, పట్టణ కన్వీనర్ కుమ్మరికుంట్ల నాగన్న, కోటేశ్వరరావు, శంకర్, బిచ్చా, ఇసూబ్, మంగిలాల్, శ్రీరాములు, షాహిద్, వెంకన్న, యాకన్న, వీరన్న, శ్రీను పాల్గొన్నారు.

● ఇనుగుర్తి : కేంద్రం అమలులోకి తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఇనుగుర్తి పెద్ద బస్టాండ్ సెంటర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల కార్యదర్శి జల్లె జయరాజ్, హమాలీ యూనియన్ నాయకులు అల్లపు రాములు, తమ్మడపల్లి సుగుణ, గుజ్జునూరి యాకయ్య, బూర యాకయ్య, గుజ్జునూరి వెంకన్న, రమ, సుంకరి జన్నయ్య, దుంపల రాజయ్య, అమీర్, సోమయ్య పాల్గొన్నారు.

● కేసముద్రం : కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి జల్లె జయరాజు డిమాండ్ చేశారు. కేసముద్రం గాంధీసెంటర్‌లో శనివారం ఆ సంఘం ఆధ్వర్యంలో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ 8గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచి, 29 చట్టాలను నాలుగు లేబర్‌కోడ్‌లుగా మార్చి కార్మికులను కార్పొరేట్లకు బానిసలుగా మార్చారని ఆరోపించారు. కార్యక్రమంలో సోమారపు ఎల్లయ్య, సుంచు కొమురయ్య, లింగాడపు యాకయ్య, ఎండి.అక్బర్, కొంగర కవిత, తేళ్ల సంజీవ, తాళ్ల వెంకన్న, మోరపాక సత్తెమ్మ పాల్గొన్నారు.

● నెల్లికుదురు : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ చంద నరేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ పెరమాండ్ల బాబుగౌడ్ మాట్లాడారు. కార్మిక హక్కులను హరించే 4 లేబర్‌కోడ్‌ల అమలుకు కేంద్రప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాన్నారు. ఈ కార్యక్రమంలో బొల్లం ఎల్లయ్య, వీరన్న, ఐలేష్ పాల్గొన్నారు.

రైల్వే వ్యాగన్ పరిశ్రమను వరంగల్‌కు తరలించేందుకు కుట్ర

● బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శ్యాంసుందర్‌శర్మ

మహబూబాబాద్‌రూరల్, నవంబరు22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు మంజూరైన రైల్వేవ్యాగన్ పరిశ్రమను వరంగల్ తరలించేందుకు వరంగల్ ఎంపీ కడియం కావ్య కుట్రలు చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు క్యాచువల్ శ్యాంసుందర్‌శర్మ ఆరోపించారు. మహబూబాబాద్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రప్రభుత్వం మానుకోట అభివృద్ధితో పాటు యువత ఉపాధి కోసం రైల్వేవ్యాగన్ పరిశ్రమను కేటాయిస్తే ఆ పరిశ్రమను వరంగల్‌కు తరలించేందుకు అక్కడి ప్రజాప్రతినిధులు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. కేసముద్రం మండలం తాళ్లపూసపల్లి సమీపంలో వ్యాగన్ పరిశ్రమ కోసం స్థలాన్ని రైల్వే అధికారులు పరిశీలించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం అశోక్, పట్టణ అధ్యక్షుడు వెన్నమల అజయ్, రాదాపటేల్, సురేందర్, చిరంజీవి, నరేష్, సందీప్, బాలు పాల్గొన్నారు.

‘ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి’


ఎమ్మెల్యే మురళీనాయక్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నేతలు

మహబూబాబాద్ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (టీయూఎఫ్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముద్దసాని వెంకటేశ్వర్లు, నాయిని శ్రీనివాస్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్‌లో ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్‌కు శనివారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో అనేక కేసుల పాలై ఆర్థికంగా చితికిపోయిన ఉద్యమకారులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో తెలంగాణ ఉద్యమకారులంతా కాంగ్రెస్‌కు బాసటగా నిలిచారని గుర్తు చేశారు. డిసెంబర్ 9లోగా హామీలను అమలు చేయాలని కోరారు. ఉద్యమకారులకు నెలకు రూ.25 వేలపెన్షన్ ఇవ్వడంతో పాటు 250 గజాల ఇంటి స్థలాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ దేశగాని కృష్ణ, సమ్మయ్యగౌడ్, బానోత్ లాలు, ఆకుతోట వెంకటయ్య, రేఖ నర్సయ్య, గంధసిరి వేణు, దొంతు శ్రావణ్, సాయికృష్ణ, బొమ్మగాని వెంకన్న, గండి సత్యనారాయణ, యాదగిరి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధికి సహకరించాలి


రాజేశ్వర్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న వినియోగదారుల సంక్షేమ మండలి సభ్యులు

మహబూబాబాద్ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్ర గ్రంథాలయం అభివృద్ధికి సహకరించాలని వినియోగదారుల సంక్షేమ మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి షైన శ్రీనివాస్ కోరారు. మహబూబాబాద్‌లో మునిసిపల్ కమిషనర్ రాజేశ్వర్‌కు శనివారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా షైన శ్రీనివాస్ మాట్లాడుతూ మహబూబాబాద్ మునిసిపాలిటీ నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సెస్ రూ.10,73,000లను చెల్లించి గ్రంథాలయం అభివృద్ధికి సహకరించాలని కోరారు. జిల్లా కేంద్ర గ్రంథాలయం అనేక దశాబ్దాలుగా విద్యార్థులకు, యువకులకు, ఉపాధ్యాయులకు, నిరుద్యోగులకు, మహిళలకు, వయోవృద్ధులకు విజ్ఞాన కేంద్రంగా ఉపయోగపడుతుందని చెప్పారు. పోటీ పరీక్షలకు సంబంధిత పుస్తకాలు, మ్యాగజైన్స్ కోసం నిధులు అవసరం ఉన్నందున గ్రంథాలయానికి సెస్ బకాయిలు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల సంక్షేమ మండలి జిల్లా అధ్యక్షుడు మామిడాల సత్యనారాయణ,కార్యదర్శి షేక్ జానీ తదితరులు పాల్గొన్నారు

‘ఒత్తిడిని అధిగమిస్తేనే ఉన్నత స్థానం చేరుకోవచ్చు’



జూనియర్ కళాశాలలో మాట్లాడుతున్న మాస్టర్ ట్రైనర్ యాదగిరి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఒత్తిడిని అధిగమిస్తేనే జీవితంలో ఉన్నత స్థానం చేరుకోవచ్చని మాస్టర్ ట్రైనర్ రావుల యాదగిరి అన్నారు. మహబూబాబాద్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శనివారం ప్రిన్సిపాల్ పొక్కుల సదానందం అధ్యక్షతన విద్యార్థినులకు సైకాలజీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ పరీక్షల సమయంలో మానసిక ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. వ్యక్తి జీవితంలో మార్పు అనేది సహజమని, ఆ మార్పు జరిగినప్పుడు మనలో జరిగే ఒత్తిడిని అధిగమించినపుడే ఉన్నత స్థానాలకు చేరుకుంటామని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ సదానందం మాట్లాడుతూ అధ్యాపకులు బోధించే పాఠ్యాంశాలను ప్రతి రోజు విద్యార్థినులు చదువుకొని ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలకుసన్నద్ధం కావాలని సూచించారు. సమావేశంలో అధ్యాపకులు స్వాతి, చొప్పరి శ్రీనివాస్, శ్రీను, సాదిక్ అలి, కుమార్, పర్వీన్‌బేగం, రవికిరణ్, రియాజ్, సురేందర్, నవీన్, కిరణ్‌కుమార్, భార్గవి, సరిత, స్వనూప, సృజన, పూర్ణిమ, శ్రవణ్‌కుమార్, రవి, భాగ్యలక్ష్మీ, లక్ష్మీ, కళావతి, సత్యనారాయణ పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

‘ఆయుష్ ఆస్పత్రి లైసెన్స్ రద్దు చేయాలి’

నెహ్రూసెంటర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఆయుష్ ఆస్పత్రి లైసెన్స్‌ను రద్దు చేయాలని ప్రజాసంఘాల నాయకుడు కుర్ర మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మానుకోటలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట బాధిత కుటుంబసభ్యులతో కలిసి ప్రజాసంఘాల నాయకుల ఆధ్వర్యంలో శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబాబాద్ మండలం హజర్యాతండాకు చెందిన గుగులోతు కల్యాణికి గర్భసంచి ఆపరేషన్ చేసి డాక్టరు కుట్లు సరిగ్గా వేయకుండా పంపించినట్లు ఆరోపించారు. దీంతో ఆమెకు ఆపరేషన్ అయిన ప్రదేశంలో చీము, రక్తస్రావమై అనారోగ్యానికి గురైందని పేర్కొన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యుడు అంజన్‌కుమార్‌పై చర్యలు తీసుకోవడంతో పాటు ఆస్పత్రి లైసెన్స్‌ను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐలయ్య, ఎల్లయ్య, రెడ్యా, రవి, బాలాజీ, బాలకృష్ణ, నాగన్న, శంకర్, వెంకన్న, కౌసల్య, పద్మ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

డోర్నకల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలో వరికోతల సీజన్ ప్రారంభమైనందున సెర్ప్ ఆధ్వర్యంలో ఏటా నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని సీపీఎం మండల కార్యదర్శి ఉప్పనపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం డోర్నకల్ సీపీఎం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే రైతులకు మద్దతు ధర లభిస్తుందని, అంతేకాకుండా రైతులకు అందుబాటులో ఉంటున్నందున దళారుల ప్రమేయం లేకుండా ఉండేందుకుగాను కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు నవాబ్, దాసరి మల్లేశం, మాచర్ల సైదులు పాల్గొన్నారు.

‘పెండింగ్ బిల్లులను చెల్లించాలి’

గార్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీతో పాటు డీఏ పాత బకాయిలుపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ వీరునాయక్ కోరారు. శనివారం గార్లలో గిరిజన ఆశ్రమ పాఠశాలలో సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం చట్టసవరణ చేసి ఉపాధ్యాయులకు టీఈటీ నుంచి మినహాంపు కల్పించాన్నారు. రాష్ట్రప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీ వేతన సవరణ కమిషన్ సూచనల మేరకు పెండింగ్ సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు మాలోత్ శివనాయక్, వీరునాయక్, ప్రసాద్, గంగావత్ శ్రీనివాస్, నాగేశ్వరరావు, రమేష్, శ్రీను, కుటుంబరావు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు ఉత్తరయ్య రాజీనామా



గార్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కోట ఉత్తరయ్య శనివారం పార్టీ ప్రాథమిక సభ్యత్వాని రాజీనామా చేశారు. తన రాజీనామ పత్రాన్ని మండల పార్టీ అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్‌కు అందించారు. అనేక సంవత్సరాలుగా గార్లలో పార్టీ అభివృద్ధికి కృషి చేసిన ఉత్తరయ్య బీఆర్ఎస్‌ను వీడి ఈనెల 25న ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ఉత్తరయ్య తెలిపారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

● సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకుడు చిన్నచంద్రన్న

కేసముద్రం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పాయం చిన్నచంద్రన్న ఆరోపించారు. కేసముద్రం అంబేద్కర్‌సెంటర్‌లో శనివారం ఆయన మాట్లాడారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మూడు సంవత్సరాల సంబరాలపేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని వృథా చేస్తోందని అన్నారు. రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం ఈనెల 24న జిల్లా కలెక్టరేట్ల ఎదుట పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ నాయకుడు ఆవుల కట్టయ్య, పెరుమాండ్ల జానకిరాములు, జంపాల రాంప్రసాద్, పుల్లయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతున్న కేంద్ర ప్రభుత్వం

● ఎన్డీ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న



అంబేద్కర్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న ఎన్డీ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు మండల వెంకన్న

మహబూబాబాద్‌రూరల్, నవంబరు22 (ఆంధ్రజ్యోతి) : అటవీ సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టేందుకే ఆదివాసీలు, మావోయిస్టులను పట్టుకొని కాల్చిచంపుతున్నారని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు మండల వెంకన్న ఆరోపించారు. మానుకోటలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట బూటకపు ఎన్‌కౌంటర్లు, ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆదివాసీలపై దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయని ఆరోపించారు. మోదీ, అమిత్‌షాల అప్రజాస్వామిక చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తెలంగాణ ప్రజాఫ్రంట్ బాధ్యుడు గుగులోతు కిషన్‌నాయక్ మాట్లాడుతూఆదివాసీ బిడ్డలను, మావోయిస్టులను పట్టుకొని కాల్చిచంపడం తగదన్నారు. కార్యక్రమంలో హెచ్.లింగన్న, చారి, హరీష్, సామ పాపయ్య, ముత్తయ్య, భావ్‌సింగ్, శ్రీను, సునిత, యాకూబీ, మునిత, పుష్ప పాల్గొన్నారు.

సేవాలాల్ మహారాజ్ గుట్టపై భోగ్‌బండార్

మహబూబాబాద్ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మానుకోట జిల్లా కేంద్రం శివారు అనంతారం సమీపంలోని సంతు సేవాలాల్ మహారాజ్ గుట్టపై శనివారం భోగ్ బండార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కేంద్రం నుంచి సంతు సేవాలాల్ మహారాజ్ గుట్ట వద్దకు బైక్‌ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అజ్మీర సురేష్‌నాయక్ మాట్లాడుతూ సంతు సేవాలాల్ మహారాజ్‌గుట్ట వద్ద ట్రస్టు ఆధ్వర్యంలో సేవాలాల్ గుడి నిర్మాణం చేపట్టామని, అక్కడ ట్రస్టు తరపున మాత్రమే సేవాలాల్ ఉత్సవాలు నిర్వహిస్తామని మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ హైకోర్టులో స్టేతీసుకువచ్చారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దానిపై ఉన్న స్టేను ఎత్తివేయించిందని చెప్పారు. అది ప్రభుత్వ భూమి అని, గిరిజనులందరికీ చెందుతుందన్నారు. గుగులోతు దస్రూనాయక్, బాలాజీనాయక్, బోడ రమేష్, వాంకుడోతు కొమ్మాలు, భూక్య శ్రీను, హరిసింగ్, ఇస్లావత్ బాలాజీ, దల్‌సింగ్, బోడ హరిలాల్, నెహ్రూనాయక్, హట్యానాయక్, ధరావత్ బాస్కర్, ధరావత్ వెంకన్న, నందులాల్ పాల్గొన్నారు.


గుట్టపై భోగ్‌బండార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న గిరిజనులు

మహిళలకు చీరలు పంపిణీ

పాలకుర్తి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అందరికి ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తున్న అదనపు కలెక్టర్ పర్మార్ పింకేష్‌కుమార్ అన్నారు. శనివారం పాలకుర్తి మండలకేంద్రంలోని రైతు వేదికలో మండల మహిళా సంఘాల గ్రూపులకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన మహిళలందరికీ ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందన్నారు. కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో డీఎస్. వెంకన్న, అదనపు ఏపీడీ నూరోద్దీన్, మార్కెట్ చైర్‌పర్సన్ లావుడ్యా మంజుల పాల్గొన్నారు.


పాలకుర్తిలో చీరలకు పంపిణీ చేస్తున్న పింకేష్‌కుమార్

ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరి మృతి


జవహర్‌లాల్ (ఫైల్)

గూడూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్రగాయాలై చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఎస్సై గిరిధర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. ఏపూరు గ్రామానికి చెందిన ఇస్లావత్ జవహర్‌లాల్ (55) గత రెండ్రోజుల క్రితం సొంత పనుల నిమిత్తం తన ద్విచక్రవాహనంపై గూడూరుకు వచ్చాడు. పనులు ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా బ్రహ్మణపల్లి జాతీయ రహదారి దాటుతుండగా ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీ కొట్టింది. ఈ ఘటనలో జవహర్‌లాల్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య సత్తెమ్మ, కుమారులు వెంకన్న, రాజీవ్ ఉన్నారు. కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే


మహమూద్‌పట్నంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మురళీనాయక్

కేసముద్రం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరతో పాటు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తూ ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ కోరారు. మహమూద్‌పట్నం, కేసముద్రం విలేజి, కల్వల గ్రామాల్లో కేసముద్రం సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన శనివారం సాయంత్రం ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, సొసైటీ చైర్మన్ ధీకొండ వెంకన్న, వైస్ చైర్మన్ అంబటి మహేందర్‌రెడ్డి, ఎంఏవో బి.వెంకన్న, గుగులోత్ రాంజీ, శ్రీను పాల్గొన్నారు.

వడ్ల కొనుగోలు కేంద్రాల ప్రారంభం

ఇనుగుర్తి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కోమటిపల్లి, తారాసింగ్‌తండాల్లో శనివారం కేసముద్రం సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సొసైటీ వైస్‌చైర్మన్ అంబటి మహేందర్‌రెడ్డి ప్రారంభించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కూరెల్లి సతీష్, రావుల మల్లేషం, ఇస్లావత్ బాలు నూనావత్ శ్రీనివాస్, సపావట్ నంద, కీమా పాల్గొన్నారు.

జీపీ భవన నిర్మాణానికి భూమిపూజ


జీపీ భవనానికి భూమిపూజ నిర్వహిస్తున్న తహసీల్దార్ నరేష్

నెల్లికుదురు, నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పార్వతమ్మగూడెం గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శనివారం భూమిపూజ నిర్వహించారు. రూ.20 లక్షల ఎన్ఆర్ ఈజీఎస్ నిధులతో మంజూరైన భవనిర్మాణానికి స్థలం కేటాయిచి పూజలనిర్వహించారు. తహసీల్దార్ చంద నరేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎదళ్ల యాదవరెడ్డి, మాజీ జడ్పీటీసీ హెచ్.వెంకటేశ్వర్లు, గొల్లపెల్లి ప్రభాకర్‌గౌడ్, పరిపాటి వెంకట్‌రెడ్డి, ఎదళ్ల వెంకట్‌రెడ్డి, సొంటిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గొగుల మల్లయ్య, వలబోజు వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక

కేసముద్రం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం స్టేషన్ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన రుచిత 17 ఏళ్ల విభాగంలో అలినా 14 ఏళ్ల విభాగంలో ఎస్‌జీఎఫ్ఐ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం బందెల రాజు, పీడీ కొమ్ము రాజేందర్ శనివారం తెలిపారు. ఇటీవలె మహబూబాబాద్‌లో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభకనబర్చడంతో రుచిత ఈనెల 25, 26 తేదీల్లో కరీంనగర్‌లో, అలినా ఈనెల 28, 29 తేదీల్లో మేడ్చల్ జిల్లా కండ్లకోయలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. వారివెంట గంగుల శ్రీనివాస్, ముదిగిరి సదయ్య ఉన్నారు.

ఆదివాసీ పోరాట యోధుడు బిర్సాముండా


బిర్సాముండా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పార్నంది రామయ్య

గూడూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీ పోరాట యోధుడు బిర్సాముండా అని సామాజిక అధ్యయన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పార్నంది రామయ్య అన్నారు. గూడూరు ప్రాథమిక పాఠశాలలో బిర్సాముండా 150వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటం వద్ద ఉపాధ్యాయులు, విద్యార్థులు శనివారం నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ ఆదివాసీ స్వాతంత్ర్య సమరయోధుడు, జానపద నాయకుడు బిర్సాముండా అని అన్నారు. 19వ శతాబ్దపు చివరిరోజుల్లో నేటి బీహర్, జార్ఖండ్ ప్రాంతంలో బ్రిటీష్ కాలంలో ఆదివాసీ ఉద్యమాలను నిర్వహించాడన్నారు. 22 ఏళ్ల వయస్సులో బ్రిటీష్ ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించారన్నారు. తద్వారా భారత స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో ఓ ప్రముఖ వ్యక్తిగా బిర్సాముండా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రాములు, సామాజిక అధ్యయన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు మోకాళ్ల వెంకన్న, గుండగాని కృష్ణమూర్తి, పోచలయ్య, అరుణ, జయ, విజయ, పద్మ, యమున పాల్గొన్నారు.